# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

## గమనిక

క్రైస్తవ కీర్తన పుస్తకము తిరిగి ముద్రించబడి మావద్ద దొరుకుచున్నది. కొన్ని క్రొత్త కీర్తనలు చేర్చబడి అందముగా ప్లాస్టిక్ అట్టతో బైండింగ్ చేయబడినది. పుస్తకము ఖరీదు రూ. 6/– మాత్రమే. ఆర్డినరీ పోస్టేజీ 0-50 పైసలు అదనం. రిజిష్టర్ పోస్టులో కావలసినవారు ఇంకో రూ. 5/– పంపించాలి. కీర్తన పుస్తకములు V.P.Pలో పంపబడవు. వలయువారు ఈ దిగువ చిరునామాకు M.O. ముందుగా పంపి పొందండి :

**SATYA VANI**
P. O. Box. 80, Kakinada
A. P. – 533 001.

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
**J. C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక **10** మే **1987** సంపుటి **7**


# సంపాదకీయము

## మరియ, మార్త, లాజరు

*(Mary, Martha and Lazarus)*

బైబిలులో వ్రాయబడిన శ్రేష్టమైన శీలము గల వ్యక్తులలో మరియ, మార్త, లాజరు గలరని మనకు తెలియును. ఇరువురు సహోదరిలు ఒక సహోదరుడు యెరూషలేముకు దగ్గరగా నున్న బేతనియ అను గ్రామములో కలసి మెలసి జీవించెడివారు. వారిలో ఒక్కరయిను వివాహము చేసికొనినట్లు మనకు తెలియదు. యేసుక్రీస్తుతో వారికి గల పరిచయమును గూర్చి తప్ప మరి యేమియును మనకు తెలియదు. వారు యేసును ఎప్పుడు, ఎక్కడ ఎట్లు కలసికొనిరో మనకు తెలియదు గాని ఆయనను గూర్చి బాగుగా ఎరిగినవారై యున్నట్లు మనకు కనిపించుచున్నది. ఆ ముగ్గురు కూడ ఒకరిపట్ల యొకరు మిక్కిలి ప్రేమ గలిగిన వారై యుండెడివారు.

మరియ ప్రభువు మాటలను వినుటకు వేగిరపడుట చూడగా ఆమెకు ఆయన పట్ల గల గొప్ప భక్తిని అది మనకు గుర్తు చేయు చున్నవి. మార్త గూడ మంచి స్త్రీయే. అయితే ఆమె గృహ సంబంధమైన పనులలో మునిగి యున్నట్లు మనకు కనబడుచున్నది. లాజరును గూర్చియైతే, అతడు చనిపోయి పాతిపెట్టబడగా యేసు వానిని లేపెనని మనకు తెలియును. వీరినుండి మనము చాలా విలువైన పాఠములను నేర్చుకొనవచ్చును. వాటిలో కొన్నిటిని గూర్చియైనను యోచింపవలెనని మిమ్మును ఆహ్వానించుచున్నాను.

లూకా 10 : 38-42లో యేసుక్రీస్తు బేతనియ గ్రామములో నున్న మరియ, మార్త, లాజరు గృహమును దర్శించుటను గూర్చి మనము చదువగలము. యేసుక్రీస్తు ఈ ఇరువురు సహోదరిలను గూర్చి బాగుగా ఎరిగినవాడై యున్నాడని ఈ సందర్భమును బట్టి మనము గ్రహింపగలము. లాజరును గూర్చి యిక్కడ వ్రాయబడలేదు. అయితే ఖచ్చితముగా అతడు అక్కడనే యుండెనని నమ్మవచ్చును. మరియ యేసునొద్ద కూర్చుండి ఆయన బోధ వినుచుండెను. ఆమె సోమరియై తన పనిని అశ్రద్ధ చేయలేదు గాని అంతకంటె శ్రేష్టమైన యేసు మాటలను వినుటకు ఆసక్తి చూపెను. మార్తయైతే విస్తారమైన పని పెట్టుకొని గృహములోనున్న పదమూడు లేదా అంతకంటె ఎక్కువ మందికి ఆతిథ్యమిచ్చుటకు కావలసిన ఏర్పాట్లు చేయుటలో నిమగ్నమై యుండెను. దీనిని బట్టి ఇంతకు మునుపే యేసుతో వారికి పరిచయముండెనని మనము గ్రహింపగలము. ఈ సమయములో మార్త తన సోదరియైన మరియ సహాయమును పోగొట్టుకొనుటయే గాక ఆమెను గూర్చి యేసునకు ఫిర్యాదు చేసినది. మార్త పెట్టుకొనిన విస్తారమైన పనిని బట్టి యేసు ఆమెను గద్దించి, మరియయైతే ఉత్తమమైన దానిని అనగా తాను చెప్పు మాటలను వినుటకు ఏర్చి యున్నదని ఆమెతో చెప్పెను. మనము ముందుగా ఏమి చేయుటకు

యోచింపవలెనో ఈ పాఠము నుండి గ్రహింపగలము. మరియు సమస్తమును విడచి యేసు నొద్దకు వచ్చి ఆయన మాటలను వినినందున ఆమెను మెచ్చుకొనిన సంగతి మనకు తెలిసినదే.

యేసునుగూర్చి తెలిసికొని ఆయనకు లోబడవలసిన అవసరము మనకు గలదని ఈ పాఠము ఖచ్చితముగా మనకు బోధించుచున్నది. అన్నిటికంటె ముందు మనము ఆత్మీయ విషయములకు ప్రాధాన్యత నివ్వవలసి యున్నది. ఈ లోకసంబంధమగు విషయములు అనగా ఉద్యోగము, స్కూలుపని లేదా ఇతర విధములైన అనేకమైనవాటిలో మునిగిపోయినపుడు మనము చాలా ఘోరమైన పొరబాటు చేయుచున్నాము. మన నైతిక ప్రవర్తన, ఆలోచనలు మంచిగా నున్నప్పటికి సమస్తము కంటె మనము వేటికి మొదటి స్థాన మివ్వవలెనో వాటికే ప్రథమస్థాన మివ్వవలెను.

యోహాను 11:1-46లో మరియు, మార్త, లాజరులను గూర్చిన రెండవ సంఘటనను గూర్చి చూడగలము. లాజరు అనారోగ్యముతో యున్నట్లు యిక్కడ మనము చదువగలము. యేసు వచ్చి తమ సోదరుని స్వస్థపరచవలెనని ఆ యిరువురు ఆయనకు వర్తమానము పంపిరి. అయితే తానున్న స్థలమందే యేసు మరియొక రెండు దినములు గడిపెను. బహుశ ఆయన వచ్చినచో లాజరును స్వస్థపరచునని వారు నిరీక్షించుచున్నారు. అయితే తానున్న స్థలమందే ఆయన నిలచి యుండుటవలన లాజరు మరణము, పిమ్మట యేసు వచ్చుట, అతనిని మృతులలోనుండి లేపుటద్వారా అనేకులు ఆయన యందు విశ్వాసముంచుట మున్నగు విషయములు సంభవించుట మనము చూడగలము.

రెండు దినములైన తరువాత యేసు తాను బేతనియకు వెళ్లుటను గూర్చి వారికి తెలుపగా ఆయన శిష్యులు మిక్కిలి భయపడిరి. ఏల

యనగా ఆ ప్రాంతమందుగల కొందరు మతోన్మాదులు యేసును చంపవలెనని చూచుచుండిరి. అయినప్పటికి మనము వెళ్ళవలెనని యేసు చెప్పెను. బేతనియకు సమీపించినపుడు మొదట మార్త పిమ్మట మరియ యేసును ఎదుర్కొనుటకు వచ్చిరి. వారిరువురు గూడ ప్రభువా, నీవు యిక్కడ వుండినచో మాసహోదరుడు చావకుండునని ఆయనతో చెప్పిరి. అందుకు యేసు—లాజరు నిద్రించుచున్నాడు. అతడు మరల లేచునని వారితో చెప్పెను. అందుకు మార్త అంత్య దినమున పునరుత్థానమందు అతడు లేచునని నాకు తెలియును అని ప్రభువుతో చెప్పెను. అందుకు యేసు—పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును, అని ఆమెతో చెప్పెను (యోహా 11 : 25).

ఈ సమయములో వారి సోదరుని గూర్చి ఓదార్చుటకు అనేక మంది యూదులు మరియు, మార్తలయొద్దకు వచ్చిరి. మరియ ఆమెతో కూడ నున్నవారు దుఃఖించుట యేసు చూచి ఆత్మలో మూలుగుచు బహుగా కలవరపడెను. లాజరును ఎక్కడ ఉంచిరని ఆయన అడుగగా ప్రభువా వచ్చి చూడుమని ఆయనను ఆహ్వానించిరి. యేసు కన్నీళ్ళు విడిచెను. ఆ ఇరువురి సహోదరిల హృదయములో గల దుఃఖమును బట్టిగాక బహుశ లాజరు ఈ జీవితమును విడిచి అతడు దేవునితో జీవించుటకు వెడలిపోయెననియు అయితే అతనిని మరల ఈ పాపపు లోకమునకు శోధనతోను సమస్యలతోను నిండినయున్న జీవితమునకు రప్పింపవలసి వచ్చినందుకు యేసు దుఃఖించెనని యొక వ్యక్తి చెప్పినాడు. ఇది సత్యమైయుండవచ్చును. ఈ సంఘటనను బట్టి యేసుకు ఈ కుటుంబముపై ఎంత ప్రేమ దయగలవో మనము గ్రహింపగలము.

లాజరుపట్ల యేసుకు గల ప్రేమనుగూర్చి యూదులకు తెలియును. అయినను ఆయన లాజరును స్వస్థపరచనందున బహుగా

ఆశ్చర్యపడిరి, అనేక అద్భుతములు చేయగలిగిన ఈ వ్యక్తి ఖచ్చితముగా లాజరును మరణము పంచి చూడకుండ చేయగలడని వారు చెప్పుకొనిరి.

ఈ రాతిని పొర్లించుమని సమాధినొద్ద యేసు చెప్పగా, మార్త ఆయనతో - వద్దు ప్రభువా లాజరు చనిపోయి నేటికి నాలుగు దినములైనది గనుక అతని శరీరము కుళ్ళు వాసనకొట్టునని చెప్పెను. యేసు ఆమెతో నీవు నమ్మినయెడల దేవుని మహిమను చూతువని నేను నీతో చెప్పలేదా అనెను.

తన విన్నపమును ఆలకింపుమని ఆయన తండ్రిని పిలిచెను, ఏలయనగా దేవుడు తనను పంపెనని అక్కడ నిలిచి యున్నవారు గ్రహించు నిమిత్తము ఆయన ఆవిధముగా చేసెనని వ్రాయబడినది. ఆయనిట్లు చెప్పి "లాజరూ, బయటకు రమ్మని" బిగ్గరగా చెప్పెను. ఈ సందర్భములో యేసుక్రీస్తు ప్రత్యేకముగా లాజరును పేరుపెట్టి పిలవనిచో సమాధులలోని వారందరు బయటకువచ్చెడి వారని ఒక సోదరుడు చెప్పినాడు. ఆయన ఈ మాటలు పలికినపుడు లాజరు సమాధినుండి బయటకు వచ్చెనని తెలియుచున్నది. అతని కట్లు విప్పి పోనియ్యుడని యేసు వారితో చెప్పెను. ఈ గొప్ప అద్భుతమును చూచి అనేకులు యేసునందు విశ్వాస ముంచిరి. అయితే కొందరు పరిసయ్యుల యొద్దకు వెళ్ళి ఈ సంఘటనను గూర్చి వారికి తెలియజేసిరి.

ఇది ఎంత శక్తివంతమైన, కదిలించెడి సంఘటనయో గమనింపుము. ప్రతి వ్యక్తిపట్ల యేసుకు గల దయ ప్రేమ మరియు మరణముపై ఆయనకు గల అధికారము, ఆయన యందు విశ్వాసముంచు వారికి ఆయన యిచ్చు నిరీక్షణ నమ్మకములను గూర్చి ఈ పాఠము మనకు తెలియ జేయుచున్నది.

ఆఖరుగా, యోహాను 12 : 1-11, మార్కు 14 : 1-9లో బేత నియ గ్రామములోనే నివసించుచున్న కుష్ఠరోగియైన సీమోను యింటిని యేసు దర్శించుటను గూర్చి చూడగలము. సీమోను యేసు కొరకు ఏర్పాటు చేసిన విందులో లాజరు అతని సహోదరిలు గూడ పాల్గొనిరి. మార్త మరల అతిథులకు పరిచర్యలు చేయుటలో నిమగ్నమై యుండెను. "మరియయైతే మిక్కిలి విలువగల అచ్చజటామాంసి అత్తరుబుడ్డి తీసుకొని వచ్చి, యేసు పాదములకు పూసి తన తల వెండ్రుకలతో ఆయన పాదములు తుడిచెను"; హిమాలయములలో గల యొక మొక్కనుండి ఈ అత్తరు తయారు చేయుదురని తెలియుచున్నది. దీని వెల 300 దేనారములు అనగా సంవత్సరపు ఆదాయము. ఆయన శిష్యులలో ఇస్కరియోతు యూదా—యీ అత్తరెందుకు అమ్మి ఆ సొమ్మును బీదలకు ఇయ్యలేదనెను. వాడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధ కలిగి కాదు గాని వాడు దొంగయై యుండెనని వ్రాయబడినది.

మరియ చేసిన పని పొరబాటని యేసు చెప్పలేదు. బదులుగా ఆయన ఆమెను మెచ్చుకొనెను. బీదలు ఎల్లపుడు మీతోనే యుందురు గాని నేను ఎల్లపుడు మీతో వుండనని ఆయన అక్కడ యున్నవారికి చెప్పెను. నేను పాతిపెట్టబడుటకు ముందుగా మరియ నా శరీరమును అభిషేకించినది. ఈ లోకములో సువార్త ఎక్కడ ప్రకటింపబడినను అచ్చట ఆమె చేసిన క్రియగూడ ఆమె జ్ఞాపకార్థముగా చెప్పబడవలెనని ఆయన చెప్పెను.

కాబట్టి యూదులలో సామాన్య జనులు ఆయన కుష్ఠరోగియైన సీమోను ఇంట ఉన్నాడని తెలిసికొని, యేసును చూచుటకు మాత్రమేగాక మృతులలోనుండి ఆయన లేపిన లాజరును కూడ చూడవచ్చిరి. అతనినిబట్టి యూదులలో అనేకులు తమవారిని విడిచి

యేసు నందు విశ్వాస ముంచిరి గనుక ప్రధాన యాజకులు లాజరును కూడ చంప నాలోచన చేసిరి.

ఈ సంఘటన మనకు బోధించుచున్న పాఠమేమి? మొదటిగా, ఈ గృహమందు యేసు ఎట్లు గౌరవింపబడెనో చూడగలము. అట్టి విధముగానే ఆయన యజమానిగా, ప్రభువుగా మనలో గౌరవింపబడ వలెను. తనకు కలిగిన దానిని మరియ యేసుకు అర్పించినది. మనము నిజముగా ప్రభువును నమ్మినచో మనకున్న సమస్తమును మనలను కూడ ఆయనకు అర్పించుకొందుము. స్వార్థము వలన మనకున్న సమస్తమును ఆయనకు యిచ్చుటకు వెనుక తీసినచో, ప్రభువు మనము ఉండుటకు నిర్దేశించిన మార్గమునుండి చాలా దూరముగ తొలగి పోయినవార మగుదుము. అయితే మరియ ఏమి చేసెనో గమనింపుము. ఆమె ప్రేమపూర్వకముగా చేసిన క్రియ వలన మరియ పేరు ఎల్లపుడు జ్ఞాపకము చేసుకొనబడును. మనము చేయగలిగిన దానిని చేసినపుడు ప్రభువు మనలను జ్ఞాపకము చేసుకొనును.

నీవు యేసును విశ్వసించుచున్నావా? ఎంతమట్టుకు నీవు ఆయన యెడల నమ్మకముగా నున్నావు? అయితే నీ విశ్వాసము నెట్లు చూపించుచున్నావు? నీవు నీ జీవితములో యేసుకు అన్నిటిలోను ప్రథమస్థాన మిచ్చినచో ఆయన నిన్ను రక్షించును. ఆశీర్వదించును, గౌరవించును.

---

## సువార్తకు విధేయులగుట

## (Obedience to Gospel)

ఒకడు సువార్తకు విధేయుడు కాగలడా? అది అసంభవమను వారు గలరు. కాని బైబిలు దానికి వ్యతిరేకముగా చెప్పుచున్నది.

ఆచరణలో యున్న సువార్త సత్యములు గలవు. వాటిని మనము నమ్మవలసి యున్నది. సువార్త ఆజ్ఞలు యున్నవి. రాబోవు పాఠములలో వాటిని ఆలోచింతము. వాటికి మనము విధేయులము కావలసి యున్నది.

సువార్త సత్యములను మరియొకసారి పరిశీలించుదము. అవి క్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానమని పౌలు 1 కొరింథి 15:1-4లో వ్రాసెను. ఇవి విధేయత కలిగియుండుటకు ఎట్టి సంబంధము కలిగి యున్నది? ముందు ముందు మనకు కనబడును—ఇది చాలా సంబంధము కలిగియున్నది. అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసినది చూడుము, "మీరు పాపమునకు దాసులైయుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 6:17, 18). పాపమునకు దాసులై యుండిన తరువాత వారు నీతికి దాసులుగా మారుటను గమనించుము. ఏది యీ మార్పును కలుగజేసెను? సామాన్యముగా యిదియే: "వారికి అందించబడిన బోధను హృదయ పూర్వకముగా అంగీకరించిరి." మరియొక విధముగా చెప్పవలెనన్న క్రీస్తు సువార్తకు విధేయులైరి. కాని వారు సత్యమున కెట్లు విధేయులగుదురు? ఇక్కడ ఉపదేశక్రమమనగా క్రీస్తుయొక్క మరణము, సమాధి, పునరుత్థానము. కాని మరల పరిశీలించుము: వారు ఒక రూపమైన సిద్ధాంతమునే అంగీకరించిరి. అట్లు చేయుటలో వారు వారి పాపముల నిమిత్తము చనిపోయి, నీటి బాప్తిస్మములో ప్రభువుతో పాతిపెట్టబడి, నీటి సమాధి నుండి పునరుత్థానులైరి. ఇది యంతయు రోమా 6వ అధ్యాయము మొదటి భాగములో వ్రాయబడెను. ఇవి చదువుదము: "ఆలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచి యుందుమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు

స్థానిలో జీవించుదుము ? క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైనయెడల, ఆయన పునరుత్థానముయొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని ఎరుగుదుము" (రోమా 6:1-6). వారు ఈ రూపమైన సిద్ధాంతమును అంగీకరించిరి. దీనినే పౌలు రోమా 6 : 16, 17లో సూచించెను. ఇంతే కాదు, ప్రతీ పర్యాయము ఎవరైన యొకడు క్రీస్తు సువార్తకు విధేయులైనప్పుడు వారు ఈ రూపమైన సిద్ధాంతమునకు విధేయులగుదురు [illegible] వాని చేతలలో ప్రభువుయొక్క మరణము, సమాధి, పునరుత్థానమును చిత్రీకరింతురు.

సువార్తయొక్క కట్టడలు లేక ఆజ్ఞలు ఏమి? అవి ఎట్లు క్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానములతో సంబంధము గలిగి యున్నవో తెలిసికొనుటకు ప్రయత్నించెదము. ప్రభువే తన శిష్యుల కిట్లాజ్ఞాపించెను, "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). మత్తయిలో ఈ విధముగ వ్రాయబడెను: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను

మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదా కాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19, 20). సువార్త ప్రకటింపబడవలెనని ప్రభువు ఆజ్ఞ యిచ్చినట్లు ఇక్కడ గమనింపుము. అంతేకాదు, రక్షింపబడుటకొరకు కొన్ని ఆజ్ఞలను పాటించవలెనని చూపించుచున్నాడు. ప్రభువుయొక్క ఆజ్ఞలను నిర్వహించుచూ అపొస్తలులు యెరూషలేములో సువార్తను ప్రకటించుచు కనబడుచున్నారు (అ.కా. 2). ప్రథమముగా, యేసు నిజముగా దేవుని కుమారుడని వారు రుజువులను, సాక్ష్యములను ముందు పెట్టుచున్నారు. జనులు వీటియందు నమ్మకము పొందిన తరువాత లేఖనములలో యున్నట్లు ఇట్లు ప్రశ్నించిరి: "సహోదరులారా, మేమేమి చేతుము?" (అ.కా. 2:37). అంతట వారు నిర్వర్తింపవలసిన కార్యమున్నది. కావున పేతురు ఇట్లు జవాబిచ్చెను: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అ.కా. 2:38). అ.కా. 9లో చూచిన ప్రభువు దర్శనము పొందిన తరువాత పౌలు రక్షింపబడుటకు నేనేమి చేయవలెనని ప్రభువును అడిగి యుండెను. తరువాత అననీయ వచ్చి చేయవలసినది చెప్పెను (అ.కా. 22:16). అ.కా. 8లో ఫిలిప్పు నపుంసకునికి బోధించుట కలదు. అచట నపుంసకుడు ఫిలిప్పుతో మాట్లాడుచు బాప్తిస్మము పొందుదుననెను. ఇక్కడ వాక్యము చూచెదము: "వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినపుడు నపుంసకుడు—ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. (ఫిలిప్పు నీ పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను

అని ప్రాచీన ప్రతులలో కూర్చబడి యున్నది). ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలి వచ్చినపుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్లెను; అతడు ఫిలిప్పును మరి యెన్నడును చూడలేదు" (అ.కా. 8:37-39). సువార్తయొక్క విధులు ఏమి? మొదటిదిగా ఒకడు ప్రకటించబడు సువార్తను వినుట అవశ్యము. రెండవదిగా దేవునియందును, దేవుని కుమారుడైన క్రీస్తునందును నమ్మిక యుంచవలెను. మూడవది అతడు అతని పాపములను గూర్చి మారుమనస్సు పొందవలెను. నాలుగవదిగా అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొనవలెను. అయిదవదిగా, బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడుట జరుగవలెను.

ఈ యాలోచనలో కొనసాగుచున్నపుడు, సువార్త విధులను నిర్వర్తించుటలో ఒకడు తన పాపముల నిమిత్తము మరణించును. అనగా అతడు సువార్తను విని, తన పాపములను గూర్చి పశ్చాత్తాప పడి లేక పాపములకు దూరమయి ప్రభువును నమ్ముటకు వచ్చును. ఈ విధముగా ఇది పాపముయొక్క మరణమును సూచించుచున్నది. మరణము తర్వాత సమాధి చేయబడుట. ఇది నీటిలో సమాధి. మనము చదివి యున్నాము—ఫిలిప్పు నపుంసకుడు నీటిలోనికి సమాధి జరిగించుటకు దిగిరి. కొలస్స 2:12, రోమా 6:4లో కూడా బాప్తిస్మము నీటిలో సమాధి యని వ్రాయబడినది. సమాధి తరువాత పునరుత్థానమున్నది. అ.కా. 8 అధ్యాయములో ఫిలిప్పు నపుంసకుడు నీటిలోనుండి బయటకు వచ్చిరి యని యున్నది. రోమా 6లో సమాధి పునరుత్థానము మరియు పాతిపెట్టబడి నూతన జీవములో నడచుటకు లేపబడుట యని వ్రాయబడెను. కనుక ఇట్టి సామాన్యమైన విధులను నిర్వర్తించుటలో మనము వ్యక్తిగతముగా ప్రభువు మరణము,

సమాధి, పునరుత్థానమును గుర్తు చేయుచున్నాము. ఇంతే కాదు, క్రీస్తును నమ్మిన ప్రతి వ్యక్తి కూడా ఆయన మరణమును, సమాధిని, పునరుత్థానమును చిత్రీకరించును.

యోహాను 3:3-5లో నీటిద్వారాను, ఆత్మద్వారాను జన్మించుటను గూర్చి క్రీస్తు చెప్పెను. ఇది ఈ విషయమును మరొక రూపములో చెప్పుటయే—ఎందుకనగా ఒకడు నీటిలో పాతిపెట్టబడి మరల పైకి వచ్చినపుడు నీటినుండి జన్మించుటయే—అనగా నీటి సమాధినుండి పునరుత్థానము. అందుచేత ఒకడు నూతన జీవితములో నడచుకొనును—ఎందుకనగా అతడు ఇప్పుడు నూతనసృష్టి (2 కొరింథీ 5:17).

సువార్త విధులను నిర్వర్తించవలెను. ప్రభువుయొక్క విధులను నిర్వర్తించువారు తగిన బహుమానము పొందుదురు. కాని ఒకటి గుర్తుంచుకొనవలెను—సువార్త విధులలో ఏ ఒక్కటియు కూడా అనవసరమని లేక ప్రాముఖ్యములేనిది యని ఉల్లంఘించరాదు. ప్రతి విధిని నిర్వర్తించినపుడు ప్రభువు వానిని రక్షించి, సంఘములో చేర్చి, నిత్యజీవపు నిరీక్షణ యిచ్చి, అన్ని ఆత్మీయ దీవెనలను అనుగ్రహించును.

సువార్త అందరికొరకును యున్నది. రక్షణ పొందుటకు అందరును సువార్తకు విధేయులు కావలెను. అయినప్పటికి పౌలు అంగలార్చుచున్నాడు: "అయినను అందరు సువార్తకు లోబడలేదు" (రోమా 10:16). దీనిని బట్టి తెలియుచున్నది ఏమనగా ఒకడు సువార్తకు మాత్రమే లోబడి యుండలేడు, కాని రక్షించబడుటకు లోబడవలెను. అయితే సువార్తకు లోబడనివారి సంగతి ఏమి? పౌలు చెప్పుచున్నాడు: ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగని వారికిని ఆయన సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయున

ప్పుడు మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే" (2 థెస్స 1:7-9). దీని ప్రకారముగా దేవుని నెరుగని వారికిని, సువార్త నంగీకరించని వారికిని ఫలితమొక్కటే: దేవుని ఉగ్రతకు గురియగుట. సువార్తకు లోబడువారు రక్షింపబడుదురు, లోబడనివారు నశించుదురు యని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). రక్షణను నిర్లక్ష్యము చేయువారు తప్పించుకొనలేరని గ్రహించవలెను (హెబ్రీ 2:2, 3).

---

## నూతన నిబంధన దేవుని ఆఖరి బయలుపాటు

### (*The New Testament is God's Final Revelation*)

నేటి కాలములో అనేకులు నూతన నిబంధన లిఖించుట పూర్తియైన తరువాత గూడ దేవుడు ఆయా వ్యక్తులతో దైవావేశము వలన మాట్లాడుచున్నాడని చెప్పు అనేక విభిన్న అభిప్రాయములు గలవు. దేవుడు నూతన నిబంధనను లిఖించుట పూర్తి చేసిన తరువాత ఆయన బయలుపాటు సమాప్తమైనదని నమ్ముచున్నాను. అపొస్తలులు క్రీస్తు సువార్తను దైవావేశము వలన బయలు పరచిన తరువాత ఆ శక్తి అపొస్తలులతో నిలచిపోయినదని గ్రహింపవలెను. ఈ క్రింది కారణములను పరిశీలించినచో మనకు ఆ సంగతి విశదమగును.

1) అపొస్తలులకు సమస్తమును బోధింపబడవలెను:— యేసు క్రీస్తు సిలువ మరణము పొందకమునుపు అపొస్తలులతో ఇట్లు చెప్పెను; నేను వెడలిపోయిన తరువాత తండ్రి మీ మీదికి పరిశుద్ధాత్మను పంపును. ఆయన వచ్చి సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును (యోహాను 14:26, 16:13). దేవుడు తన బయలుపాటును అపొస్తలులకు అనుగ్రహించి వారి

ద్వారా అటు తరువాత రానున్న జనాంగములకు ఆ బయలుపాటును అందింపవలెననునది దైవ సంకల్పమై యున్నది.

2) క్రైస్తవ విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడెను :—యూదా తన పత్రికలో సహోదరుల కిట్లు చెప్పుచున్నాడు. ప్రియులారా, పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచున్నాను (యూదా 3 వచ). ఒకవేళ దేవుడు తన సంకల్పమును ఒక వేయి సంవత్సరములు వరకు బయలుపరచనెంచినచో ఆయన ఆ విశ్వాసమంతటిని మొదటి శతాబ్దములోనే తన అపొస్తలులకు బయలు పరచకపోవును.

3. 1900 సం॥లకు పూర్వము సిలువపై యేసుక్రీస్తు బలి యాగము ద్వారానే నేడు అందరును రక్షణ పొందుచున్నారు : పాత నిబంధన నిర్దేశించిన జంతుబలులను గూర్చి చెప్పుచు అవి పాపములను తీసివేయలేకపోయినవని తెల్పెను (హెబ్రీ 10 : 3, 4). యేసుక్రీస్తుకు లోబడువారికి ఆయన అర్పణద్వారానే పాపక్షమాపణ కలుగుచున్నది (హెబ్రీ 5:8, 9). లోక పాపములకు చివరి మూల్యమును యేసుక్రీస్తు చెల్లించినాడు (II పేతు 3 : 18; I యోహాను 1 : 7; హెబ్రీ 10 : 14). దేవుని విమోచనా పథకమును యేసుక్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములు సంపూర్తి చేసినవి. ఈ యుగ సమాప్తివరకు యేసుక్రీస్తు పనిని గూర్చిన సువార్త సర్వప్రపంచమునకు ప్రకటింపబడవలసి యున్నది (మత్త 28:18-20).

4) యేసుక్రీస్తు సువార్త నేడు మనకు జీవమునకు భక్తికి కావలసిన వాటి నన్నిటిని దయచేయుచున్నది :—ప్రభువైన యేసును గూర్చిన అనుభవజ్ఞాన మూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటి నన్నిటిని మనకు దయచేయుచున్నది (2 పేతు

1:3). 1900 స॥లకు పూర్వమే అవి యివ్వబడెను. దేవుడు ఏమియు మరుగు చేయక సమస్తమును యేసుక్రీస్తు ద్వారా బయలు పరచి నాడు. ఆయన సంకల్ప మంతయు బయలుపరచబడినది. జీవమునకును భక్తికిని అవసరమైన దేమైనను యున్న చో అది పేతురు కాలమునాటికే తెలియజేయబడెనని అతడు చెప్పెను. గనుక మరియొక బయలు పాటుకు తావులేదు.

5) క్రీస్తు సువార్త ద్వారా గొప్ప దీవెనలు అనుగ్రహింప బడును: సమస్త ఆత్మీయాశీర్వాదములు క్రీస్తునందు గలవు (ఎఫెసీ 1:3). దేవుడు మనలను ఎవరియందు దీవించునో పౌలు తెల్పు చున్నాడు. ఆ దీవెన లన్నియు క్రీస్తునందే గలవు. ఎన్ని దీవెనలు దేవుడు అనుగ్రహించునో అతడు పేర్కొనుచున్నాడు. అవి సమస్త మైన దీవెనలు. పాపక్షమాపణ, శాంతి, సహవాసము, వాగ్దానము, నిరీక్షణలను ఆయన దయచేయును. 1900 సం॥లకు పూర్వమే అనగా పౌలు కాలములోనే ఈ దీవెనలన్నియు అనుగ్రహింపబడెను. అందు చేత వాటికంటె అదనపు దీవెనలు మనకు అవసరము లేదు. అవి అను గ్రహింపబడవని గ్రహింపుము.

6) అపొస్తలుల సువార్త తప్ప వేరొక సువార్త ప్రకటింప రాదని లేఖనము చెప్పుచున్నది:— "మేము మీకు ప్రకటించిన సువా ర్తను గాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చు యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాప గ్రస్తుడవును గాక" (గలతి 1:8). దీనిని బట్టి వేరొక సువార్త అద నపు బయలుపాటులు శాపగ్రస్తములని వాక్యము బోధించుచున్నది.

7) యేసుక్రీస్తు, అపొస్తలుల కాలమునుండి అదనపు సువా ర్తను అంగీకరించుట లేదా ప్రత్యేక బయలుపాటులను నమ్ముట యనునవి వాక్య వ్యతిరేకమునకు గందరగోళమునకు దారి తీసినవని

తెలియుచున్నది:— ఈ దినములలో అనేకులకు ప్రత్యేక బయలు పాటులు వచ్చుచున్నవని చెప్పుట తరచు వినుచున్నాము. అయితే వీరందరి బయలుపాటు ఒకే విధముగా నుండదు. దేవుని వలన మాట్లాడుచున్నామని చెప్పువారియొక్క మాటలు పరస్పర విరుద్ధ ముగా నుండుటను గూడ మనము గమనింతుము (1 కొరి 14:33). ఆ దినమున అనేకులు—ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? అని చెప్పుదురు. అట్టివారితో ప్రభువు — అక్రమము చేయువారలారా నా యొద్దనుండి తొలగిపోవుడని వారితో చెప్పును. మొదటి శతాబ్దా రంభములో లిఖించబడిన వాక్యము (నూతన నిబంధన) లేనందువలన దేవుడు అపొస్తలులకు పరిశుద్ధాత్మ శక్తిని అనుగ్రహించి వారిద్వారా అద్భుతములు సూచక క్రియలు జరిగించుటవలన వాక్యమును స్థిర పర చెను (హెబ్రీ 2:3-4). ఇట్టి పరిస్థితులలో క్రైస్తవులు మరల మొదటి శతాబ్ధ కాలపు స్థితిని కోరుట దురదృష్టము. మనము వాక్య మునకు దేనిని కలుపరాదు. వాక్యము నుండి ఏమియు తీసివేయరాదు (ప్రక 22:18, 19). ఇట్టి సందర్భములో ప్రత్యేక దర్శనములు గల వని కొందరు చెప్పుట యనునది అక్రమము అని గ్రహింపవలసి యున్నది. అక్రమము అను మాటకు గ్రీకులో ANOMIA అను పదము వాడబడినది. (A + NOMIA = A = Against; Nomia = Law) అనగా ధర్మశాస్త్రము (నేడు క్రొత్త నిబంధన) నకు వ్యతిరేక ముగా నడుచుకొనుట అని భావము. ఈ సమయములో బెంజమన్ ఫ్రాంక్లిన్ మాటలను గమనింతము:

1) బైబిలుకంటె ఎక్కువైన బోధ ఏదైనను అది అభ్యంతరకరము. ఏలయనగా అది బైబిలుకంటె ఎక్కువగా నున్నది.

2) బైబిలుకంటె తక్కువైన బోధ ఏదైనను అది అభ్యంతరకరము. ఏలయనగా అది బైబిలుకంటె తక్కువగా నున్నది.

3) బైబిలుకు భిన్నముగానున్న బోధ కూడ మనకు అభ్యంతరము. ఏల యనగా అది బైబిలు కంటె భిన్నముగా నున్నది.

4) బైబిలుతో సమానముగా నున్న బోధ గూడ మనకు అభ్యంతరము. ఏల యనగా మనకు బైబిలు యున్నది.

దేవుని చిత్తము బైబిలుద్వారా బయలు పరచబడుచున్నదని నేను నమ్ముచున్నాను. బైబిలుద్వారా ప్రభువు చిత్తమును తెలుసుకొన గలము. యేసుక్రీస్తు, అపొస్తలులు విధించిన షరతులకు మనము విధేయత చూపినచో అప్పుడు మనము పాపక్షమాపణ నొంది క్రైస్తవుల మగుదుమని నేను నమ్ముచున్నాను. నాకు ప్రత్యేక దర్శనమీయబడినదని చెప్పు మానవుల మాటలను లక్ష్యపెట్టక, యేసుక్రీస్తు నందే సమస్త ఆత్మీయాశీర్వాదములు కలవని నేను నమ్ముచున్నాను. మన జీవితములను నడిపించుటకు బైబిలు మార్గదర్శిగా నున్నదని నేను నమ్ముచున్నాను. ఆయన చెప్పిన విధముగా మనము క్రీస్తుకు నమ్మకమైనవారిగా నున్నచో ఒకానొక దినమున ఆయన మనలను తప్పకుండ పరలోకమునకు చేర్చునని నేను నమ్ముచున్నాను.

—బి. విజయకుమార్, కాకినాడ.

---

## యెహోవాకు అసహ్యములైనవి

### (*Things The Lord Hates*)

(మార్చి సంచిక తరువాయి)

**నిరపరాధులను చంపు చేతులు :** పది యాజ్ఞలలో ఆరవది "నరహత్య చేయరాదు" అనునది. మొదటి తలిదండ్రుల మొదటి కుమారుడే నరహంతకుడయ్యాడు. నిర్దోషియైన హేబెలు రక్తము నేలలోనుండి దేవునికి మొఱ పెట్టినది. ధర్మశాస్త్ర ప్రకారము నరహత్య చేయువాడు మరణ శిక్షకు పాత్రుడు. అయితే యేసు ప్రభువు

ఇట్లు బోధించాడు : నరహత్య చేయవద్దు; "నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పున దేమనగా - తన సహోదరునిమీద కోప పడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పువాడు నర కాగ్నికి లోనగును" (మత్తయి 5:21, 22). "తన సహోదరుని ద్వేషించు వాడు నరహంతకుడు" అని యోహాను చెప్పాడు (1 యోహా 3:15). గనుక తన సహోదరుని లేక పొరుగు వానిని ప్రేమించని వాడు నర హంతకునితో సమానుడు.

దుర్యోచనలు యోచించు హృదయము : ప్రతి జీవరాశికి ఒక మాంసపు గుండె ఒకటి యున్నది గాని దుర్యోచనలు యోచించే హృదయము మానవునికి మాత్రమే యున్నది. దేవుడు తప్ప మానవుని హృదయాంతర్యమును ఎరిగినవా డెవడు లేడు. నరుల "హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదని" యెహోవా ఎరుగునని వ్రాయ బడి యున్నది (ఆది 6:5). అందరు పాపము చేసి దేవు డనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారని పౌలు చెప్పాడు (రోమా 3:23). "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమన ములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములోనుండియే వచ్చునని" యేసుప్రభువు బోధిం చాడు (మత్తయి 15:19). మన హృదయములు దేవుని వాక్యముతో నింపబడకపోతే దుష్టత్వముతో నింపబడతాయి. ఒక ఖాళీ గ్లాసు నిండా గాలి మాత్రమే యుంటాది. అయితే దానిని పాలతో నింపినపుడది పాలతో నింపబడిన పాత్ర అవుతాది, దానిలో గాలికి తావుండదు. అట్లే మన హృదయములు దేవుని వాక్యముతో నింపబడినపుడు అందులో దుష్టత్వానికి తావుండదు. అందుకే "నీ

యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను" అని దావీదు చెప్పాడు (కీర్త 119 : 11).

**కీడు చేయుటకు పరుగులెత్తు పాదములు :** సాధారణంగా మెదడుయొక్క ఆజ్ఞలను బట్టి పాదములు నడుస్తాయి. అయితే సొలొమోను ఇక్కడ కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములను గూర్చి చెబుతున్నాడు. అవి మానవ హృదయాలోచనను బట్టి పరుగెత్తాయి. అట్టి వాటిని దేవుడు అసహ్యించుకొంటాడు. మరల "దుష్కార్యము జరిగించుటకై సమూహమును వెంబడింపవద్దు" అని దేవుని వాక్యం చెబుతున్నది (నిర్గ 23 : 2).

మానవ జీవితం ఒక యాత్ర వంటిది. దీనిలో అతడు ప్రయాణించుటకు రెండే మార్గములున్నాయి. విశాల మార్గము నాశనానికి, సంకుచిత మార్గము జీవనానికి నడిపిస్తాయి. దేవుని వాక్యప్రకారము నడుచుకొనేవాడు ఇరుకు మార్గమున నడుస్తాడు. "యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా?" (దా. కీర్త 119 : 9).

**అబద్ధ సాక్షి :** అబద్ధ సాక్ష్యము పలుకకూడదు అనునది పది ఆజ్ఞలలో తొమ్మిదవది. అబద్ధ సాక్ష్యము పలికే వానిని, అబద్ధము లాడే వానిని దేవుడు అసహ్యించుకొంటాడు. కల్లలాడు నాలుక వలన కలిగే విపత్తులను గూర్చి ఇదివరకే మనము చూచాము. అపవాది హవ్వయొద్ద అబద్ధ సాక్ష్యము పలికాడు. దేవుడు నిషేధించిన పండును తినిన తరువాత మీరు చావనే చావరని అతడు అబద్ధము పలికాడు. తద్వారా పాపము మరణము ఈ లోకంలో ప్రవేశించాయి. యేసు ప్రభువుపై నిందలు మోపడానికి కొందరు అబద్ధ సాక్షులను వారు నిలబెట్టారు. ఆయన పునరుత్థానుడైన తరువాత కూడ రోమా సైనికులు

క్రీస్తు శిష్యులు వచ్చి ఆయన శరీరాన్ని ఎత్తుకొని పోయిరని అబద్ధ సాక్ష్యము పలికారు.

అబద్ధసాక్ష్యము లాడువారు తమ్మును తామే మలినపరచుకొంటారు. "సర్ప సంతానమా, మీరు చెడ్డవారై యుండి ఏలాగు మంచి మాటలు పలుక గలరు? హృదయము నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా" యని యేసు ప్రభువు చెప్పాడు (మత్త 12 : 34). ఒకడు తన నాలుకను వినియోగించే విధానాన్ని బట్టి అతని ఆత్మీయ పరిస్థితి గోచరమవుతాది. "కూట సాక్షి శిక్ష నొందకపోడు. అబద్ధములాడువాడు తప్పించుకొనడని" సొలొమోను చెప్పాడు (సామె 19 : 5). అపవాది అబద్ధ జనకుడు గాని సత్యవాక్యము ననుసరించు వాడు అబద్ధ సాక్షి కాజాలడు.

**అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడు :** తన బిడ్డల మధ్య దేవుడు ఐక్యత కోరుచున్నాడని యిది తెలియజేయుచున్నది. అందువలన సహోదరుల మధ్య జగడములు, విభేదములు పుట్టించు వానిని ఆయన అసహ్యించుకొంటాడు. "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము! అది తలమీద పోయబడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారిన పరిమళ తైలమువలె నుండును. సీయోను కొండ మీదికి వచ్చు హెర్మోను మంచువలె నుండును" (కీర్త 133). పౌలు రోమాలోని క్రైస్తవుల కిట్లు వ్రాసాడు : "సహోదరులారా మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగ జేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు" (రోమా 16 : 17).

—కవిత గూటం, కాకినాడ.

# ప్రభువు యొక్క నిత్యనిబంధన
## *(Lord's Eternal Law)*

—జె. సి. బెయిలీ.

[ది 17-2-87న సహోదరులు జె. సి. బెయిలీ గారు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థుల నుద్దేశించి ఉపన్యసించిరి. వారి ఉపన్యాసమును తెనుగున కనువదించి వ్యాస రూపకముగా యీ దిగువున ప్రచురించుచున్నాము.]

మానవుడు చట్టానికి లోబడుట దేవునియొక్క ఉద్దేశ్యమై యుండెను. కావున ఆయన పాత నిబంధనను యూదులకును, క్రొత్త నిబంధనను జనులందరికిని ఇచ్చెను. ఆదాము హవ్వలను ఏదెను వనములో ఉంచి దేవుడు వారికి కొన్ని ఆజ్ఞలను విధించెను. పురుషుడు తండ్రిని, తల్లిని విడిచి భార్యను హత్తుకొనును. వారిరువురు ఏక శరీరు లగుదురని ఆజ్ఞాపించెను.

మానవుడు పనిచేయవలెనను నదియు దేవుని ఆజ్ఞయై యున్నది. ఆదాము హవ్వలను ఏదెను వనములో ఉంచగా వారికి తోట యొక్క సౌందర్యముతో బాటు పనిని కూడా నియమించెను. కాని వారు పాపము చేసినప్పుడు తోటయొక్క సౌందర్యము వారినుండి తీసివేయ బడెనే గాని పనిని మాత్రము తీసివేయలేదు. పైగా చెమటోడ్చి నీ ఆహారమును సంపాదించు కొందువని ఆదాముతో చెప్పెను. యేసు క్రీస్తు భూలోకమునకు వచ్చినప్పుడు వడ్రంగి పని చేయుచు తన కాలమునంత గడిపెను. ఆయనయొక్క ముప్పదవయేట సేవలో ప్రవేశించి దానియందు మూడున్నర సంవత్సరములబాటు కొన సాగెను. ఇక్కడ దేవుని కుమారుడంతటివాడు పని చేయుట గమనింప వలెను. తీతు 3 : 14లో ఉన్న "సత్క్రియలు" అనుమాట గౌరవ ప్రదమైన పనులు అని కూడా అనువదించవచ్చును. కాబట్టి మనవారు

పనిచేయుట నేర్చుకొనవలెను. నా కుమారులలో ఒకడైతే దంత వైద్యునిగా జీవనోపాధి చేయుచు దేవుని పనియందు నిమగ్నమై యున్నాడు.

పౌలు సమర్పించుకొన్నట్టుగా నేడు ఏ బోధకుడును సమర్పించుకొనుట లేదు. పనిచేయుట పౌలుయొక్క ప్రథమ కర్తవ్యము. అతడిట్లనెను, "నా అవసరముల నిమిత్తమును, నాతో ఉన్నవారి నిమిత్తమును ఈ నా చేతులు కష్టపడినవని మీకే తెలియును..." అపొ.కా. 20:34, 35. అతడు పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యమని యేసు చెప్పిన మాట కొరకు, ఇతరులకు మాదిరిగా నుండుట కొరకు అట్లు చేసెను. ఐశ్వర్యము కలుగుటకు కష్టపడి పని చేయవలెను. ఒకరుచేసిన పనివలన వేరొకరు పరలోకమునకు పోలేరు. ఎవరి రక్షణ కొరకు వారే విధేయులు కావలెనని హెబ్రీ 5:10 నందు చెప్పబడెను. అట్లే ఫిలిప్పీ 2:12 నందు మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడని తెలుపబడినది. కావున పనియందు కూడా ఎవరు కష్టపడుదురో వారే పరలోకమునకు పోగలరు. బోధకులైతే వారి సమయాన్ని దేవునికిచ్చుచుండగా క్రైస్తవులుగా ఉండిన మిగిలిన వారు దేవుని నిమిత్తం కష్టపడి పని చేయవలెను. యూదులు ఈ సత్యాన్ని గమనించారు. అందుచే 'కుమారునికి కష్టపడి పని చేయ నేర్పని తండ్రి వానిని దొంగగా చేయును' అను నానుడి వారిమధ్య గలదు.

భారత దేశములో జరుగుచున్న దేవుని పని జయము పొందుట మనపై ఆధారపడి యున్నది. మన దేశములో 1963వ సంవత్సరములో స్థాపింపబడిన దేవుని పని వంటిదే అమెరికా దేశంలో 170 సం॥లకు పూర్వము స్థాపింపబడెను. అయితే ఇప్పుడు ఇండియా పని నిమిత్తము అందుబాటగుచున్న ధనము ఆ నాడు అమెరికాలో అందుబాటు కాలేదు. బహుశా 95 శాతం బోధకులు ఆనాడు ఆ దేశంలో స్వయం

పోషకులుగా ఉండిరి. అందు వలననే వారప్పుడు అత్యధిక జయమును పొందిరి. పెంతెకోస్తునాడు స్థాపింపబడిన పని నలుపది సంవత్సరముల వరకు జయము పొందుచూ వచ్చెను. దాని తరువాత ఇదే జయము పొందిన పని యున్వనస్తులకు ఆందోళన పరిస్థితులు ఎదురు కావచ్చును. అయినను బాధ్యత మనమీద ఆధారపడి యున్నది. బోధకులకు సహాయము దొరకనప్పుడు అమెరికాలో సంఘం అభివృద్ధి చెందెను. దీనిని బట్టి మానవుడు పనిచేయుట ముఖ్యమని దేవుడు ఎంచినట్లుగా మనం ముందుగా తెలుసుకొందము. అట్టి దానివలన ప్రయోజనమే కలుగును. ఐరోపాకు ఉత్తర భాగాన ప్రొటస్టెంటులు, దక్షిణ భాగాన కేథలిక్కులు ఉండిరి. ఎక్కడ పనినిగౌరవముగా ఎంచిరో అక్కడ దేవుని పని అభివృద్ధి చెందెను. పని చేయుట వల్లనే అమెరికాదేశం పురోగమించెను. మిగిలిన దేశాలు పేదరికంగా మారినవి. నేష్వైల్ పట్టణంలో విజయవాడలో ఉన్నంత జనం కూడా ఉండరు. అయినను ఆ పట్టణంలో వంద సంఘము లున్నవి. కాని అక్కడ ముగ్గురు మాత్రమే బోధకులు జీతములు పూర్తిగా పొందుచూ దేవుని పనిని చేయుచున్నారు. బోధకులు జీతములు పొందకుండినప్పుడే సంఘములు అభివృద్ధి కాగలవు. అట్టి పనులు చేయడానికి సభ్యులు ముందుకు రానంత వరకు సంఘములు అభివృద్ధి కానేరవు. సభ్యులు పనిచేయ ముందుకు రావడానికి బదులు వెనుకకు జంకుచున్నారా? నాతో ఒక వ్యక్తి పని చేసాడు. అతడు అనువాదకునిగా గౌరవింపబడెను. గాని డ్రైవరుగా చపరచ బడెను. ఇప్పుడైతే సంఘ సభ్యులు అట్లు ప్రవర్తించరని నేనుకొనుచున్నాను. మనము జయమును ఇంకనూ పొందలేదు గాని జయమును పొందు మార్గాన నడచు చున్నాము. కొందరు డబ్బు యిచ్చి బాప్తిస్మములు ఇచ్చుచున్నట్లు కెనడా దేశంలో ఆరోపింపబడెను. అయితే అలాంటి దురాచారము వశించి పోవలెను.

ఇండియాలో ఉన్న సంఘమునకు మేము చెంది యున్నాము అను భావమును మీరు కలిగియుండవలెను. అయితే సంఘాభివృద్ధి నిమిత్తము శ్రమించవలెను. క్రీస్తు శ్రమ పొందవలసి వచ్చెనా? అవును మనమాయనతో కూడా శ్రమ పొందినచో ఆయనతో కలసి పాలింతుము. పౌలు చెరసాలలో బందీ గావింపబడి ఉరివేయబడ కని పెట్టుచుండెను. అయినను నేను సిగ్గుపడనని అతడు చెప్పెను. ఏల యనగా "ఆ హేతువుచేత ఈ శ్రమలను అనుభవించుచున్నాను గాని నేను నమ్మినవాని నెరుగుదును గనుక సిగ్గుపడను. నేను ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినము కొరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముచున్నాను" (2 తిమోతి 1:12). మనము ఎదుర్కొను ప్రతివిధ సమస్యకు "నేను నమ్మిన వాని నెరుగుదును" అను మాటయే జవాబు.

దేవుడు సార్వత్రిక ప్రజానీకానికి "విశ్వాసమును" మరొక చట్టముగా ఇచ్చెను. "విశ్వాసము లేకుండా ఒకడు దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము". నోవహు దేవుని నమ్మి ఓడను నిర్మించెను. బహుశా అతడు అంతకు మునుపు వర్షమును చూచి యుండలేదు. అనగా నేడు మనకు తెలిసిన వర్షమును ఎరిగియుండలేదు. దేవునియొక్క ఆజ్ఞలు యుగములు లేక తరములను బట్టి మారుచుండవచ్చును. కాని దేవుని యందలి విశ్వాసము మాత్రము ఎన్నడు మారదు. మనము ఆ విశ్వాసమునకు లోబడవలెను. అనగా విశ్వాసమునకు తగిన క్రియలు చేయవలెను. కాని విశ్వాసము వలనే రక్షింపబడుదుమని మతశాఖలవారు తలంతురు. ఇదే వారికి మనకు గల ఒక ముఖ్య భేదము. విశ్వాసము వలన ఒకడు నీతిమంతునిగా తీర్చబడగలడు. కాని విశ్వాసముతో కూడిన క్రియల ద్వారా రక్షింపబడగలడు.

దేవుడు "మారుమనస్సును" సర్వ మానవాళికి మరొక చట్టముగా ఇచ్చెను. "అంతట అందరూ మారుమనస్సు పొందవలెనని

ఆయన కోరుచున్నాడు" (అపొ.కా. 17:30). "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు నశింతురు" లూకా 13 : 5; ప్రజలు మారు మనస్సు పొందినప్పుడు వారు చెడు మార్గముల నుండి మరలి పోవుదురు. అనగా పాపము నుండి రక్షణ వైపు మరలుదురు. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత పాప క్షమాపణతో బాటు మారు మనస్సును ప్రకటింపబడెను. మానవులు మారు మనస్సు నొందినచో ఏ పాపమైనను దేవుడు క్షమించును. పేతురు చేసిన మొదటి ప్రసంగములో మారు మనస్సు ఖచ్చితమైన ఆజ్ఞగా కనబడుచున్నది.

"ఒప్పుకొనుట" దేవునియొక్క మరొక సార్వత్రికమైన ఆజ్ఞయై యున్నది. దేవునియందు మనకున్న విశ్వాసాన్ని మనం ఒప్పుకొనవలెను. తదుపరి రక్షణ కలుగునట్లు బాప్తిస్మము పొందవలెను. దేవుడు లోకానికిచ్చిన ఆజ్ఞలేవనగా - పనిచేయుట, నిరీక్షణ, విశ్వాసము, మారు మనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము మొదలగునవి. వీనిని ప్రతి మానవుడు ప్రతి యుగము నందు పాటించవలెనని ప్రభువు యొక్క నిత్య నిబంధనయై యున్నది. ★

## బైబిలు బాప్తిస్మము
### (Bible Baptism)

బాప్తిస్మమును గూర్చి సత్యమును చెప్పు గ్రంథము బైబిలు ఒక్కటి మాత్రమే. గనుక ఈ అంశమును గూర్చిన సత్యమును తెలుసుకొనుటకు మనము దేవుని ఆత్మావేశ లేఖనములను పరిశోధించవలెను. దయచేసి ఈ దిగువ వాస్తవములను గమనించుము :

1. ఒకే ఒక్క బాప్తిస్మమున్నది (ఎఫెసీ 4:5). ఈ వాస్తవము క్రీ॥శ॥ 64 సం॥లో వ్రాయబడెను. అది వరకు మరికొన్ని బాప్తిస్మములుండెను గాని అప్పటికి ఒకే ఒక్క బాప్తిస్మము ఉండెను.
2. అది సమాధి (కొలస్స 2:12; రోమా 6:3, 4). బాప్టిజో అను గ్రీకు పదమునుండి కలిగిన ఈ మాటకు ఎల్లప్పుడు సమాధి, ముంచబడుట యను అర్థము వచ్చును గాని అది ఎన్నడు చిలకరించుట గాని, కుమ్మరించుట గాని కాదు.

3. అది ఒక నీటి సమాధి (అపో.కా. 8:26-39).

4. అది సువార్తయొక్క ఒక ఆజ్ఞ (మార్కు 16:15, 16; అపో.కా. 10:48).

5. అది తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామమందు చేయబడవలెను (మత్తయి 28:19, 20).

6. అది రక్షించును (1 పేతురు 3:21).

7. అది పాపక్షమాపణ కొరకు (అపో.కా. 2:38).

8. అది పాపములను కడిగివేయును (అపో.కా. 22:16).

9. అది క్రీస్తులో ప్రవేశింపజేయును (రోమా 6:3, 4; గలతీ 3:26, 27).

10. అది ఒకని సంఘములో ప్రవేశింపజేయును (1 కొరింధి 12:13).

---

Regd. No. H/KD-45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................
..............................
..............................
..............................